# హాబీ

## రావు జీ

క్రిందటిసారి పడిన చిక్కు ఈసారికూడా తప్పలేదు.

"రిపార్టు" అనే మాటకు సరైన తెలుగు దొరకక క్రిందటిసారి గొడవ పడ్డాను. ఈసారి 'హాబి'అనే మాటను గురించి కూడా అంతే అయింది!

నాకు తెలియకపోయినా, భాషాకోవిదులూ మిత్రులూ గనక శ్రీ శిరోమణి గారికైనా తెలియక పోతుందా అని

"అయితే 'హాబీ' అనే మాటకు తెలుగు ఏమిటండీ?" అని వారిని...ఏవో మాటల సందర్భాన...అడిగి చూచాను.

"వినోదం, విలాసం, దిలాసా, ఖులాసా, తమాషా, సరదా" అంటూ గుక్క తిరగకుండా చదివివేసి—

"సందర్భాన్ని బట్టి వుపయోగించాలి గాని, వీటిలో ఏ వొక్కటీ కూడా సరైనదని చెప్పడానికి వీలులేదు సుమండీ?" అని ఆయన హెచ్చరించారు!

పడికట్టు లేకుండా మాటాడడం శ్రీ శిరోమణి గారికి అలవాటులేదు గనక, ఆయన చెప్పిన ఇన్ని మాటల్లో ఏ వొక్కటైనా సరైన అనువాదం కాకపోతుందా అని మొదట్లో అనుకున్నాను. కాని తీరా ఆలోచిస్తే ఆయన చేసిన హెచ్చరికకు తగిన కారణంలేక పోలేదని తోచింది.

సంసార ఇబ్బందులతోనూ తక్కిన చిక్కుల తోనూ మనస్సు చీకాకు పడినప్పుడు తిరిగీ కాస్త తెప్పిరిల్లడానికీ, కొంత వుల్లాసాన్ని తెచ్చుకోడానికీ పెట్టుకునే వ్యాపకాన్ని గానీ, వ్యాసంగాన్నీ గానీ, 'హాబీ' అంటారు.

అయితే, ఈ వ్యాపకమో, వ్యాసంగమో వ్యసనం మాత్రం కాగూడదు. వ్యసనం అయిన నాడు, దాన్ని అసలు 'హాబీ' అనడానికే వీలే లేదు. అప్పుడయితే దాన్ని "ఫాడ్"(Fad) అనవలసి వస్తుంది.

ఇదే 'హాబీ' నిర్వచనం. వినోదం, విలాసం, దిలాసా, ఖులాసా, తమాషా, వీటిలో ఏ వొక్కటి కూడా ఈ నిర్వచనానికి పూర్తిగా అనుగుణ్యంగా లేదుకదూ?

'హాబీస్' కు మన సంఘంలోనుంచి వుదాహరణలు చెప్పాలంటే - చీట్లాట, చదరంగం, వేట, కవితాగోష్ఠి వగైరాలను కొన్నింటిని పేర్కొనవచ్చును.

విదేశాలలో అయితే ఇవే కాకుండా, ఇంకా ఎన్నో 'హాబీస్' వాడుకలో వున్నాయి.

రకరకాల పోష్టుబిళ్లల్ని పోగుచెయ్యడం, విఖ్యాత పురుషుల సంతకాలను సేకరించడం,

ప్రసిద్ధ గ్రంథాల ప్రథమముద్రణప్రతుల్ని కొనడం, ఇలాగే చిత్రవిచిత్రమైనవి ఎన్నో !

ఈనాడే కాదు, ఏనాడూ కూడా భారతదేశ ప్రజాబహుళ్యానికి దారిద్ర్యం తప్పలేదు గనక, మన దేశంలో ఎప్పుడూ హాబీస్ విశేష ప్రచారంలోకి రాలేదేమో.

చీట్లాట, చదరంగం, వేట, కవితాగోష్టి అంటూ ఏవో కొన్నివున్నా, అవి ఏకొద్దిమంది ధనాఢ్యుల వినోదంకోసమే!

ఏ పూటకా పూట పొట్టపూడ్చు కోవడం యెలాగా అనే తాపత్రయంతోనే బ్రతుకులు తెల్లవారుతూ వున్న జనానికి హాబీస్‌తో నిమిత్త మేమిటి ?

అదేమి పాపమోగాని, మన ప్రవృత్తిలోకి అతి త్వరగానే "సీరియస్ నెస్" వచ్చి వేస్తుంది కూడాను.

'సీరియస్ నెస్' విశేషంగా వున్న జనాభాకు హాబీస్ అంటే, 'ఏమిటి ఈ వెర్రివెంగళాయి వేషాలు?' అని అనిపిస్తుంది !

విదేశాలలో, ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలో, హాబిస్ విశేషంగా ప్రచారంలో వున్నాయి.

గతించిన నాలుగైదు శతాబ్దాలలో పాశ్చాత్యుల ఐశ్వర్యం కొన్నివందల రెట్లు హెచ్చింది!

అంచేత, వారిలో హాబీస్ బాగా ప్రచారం కావడం సహజం !

పైగా, ప్రతిపనినీ యంత్రాలు చేసివెయ్యడం ప్రారంభమైన తర్వాత, పాశ్చాత్యుడికి తీరిక హెచ్చుగా దొరకసాగింది.

చాలాతీరిక వున్నప్పుడు, బుద్ధి ఏదో వొక హాబీ పైకి పరుగెడుతుంది కదూ ?

కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక్కొక్క దేశాని వొక్కొక 'డ్రింకు' (పానీయం) వున్నట్టు తోస్తుంది.

బ్రిటన్‌కు, విస్కీ !

జర్మనీకి, బీరూ !

ఫ్రాన్సుకు వైన్ !

రుష్యాకు వోడ్కా !

మన దేశానికి, కల్లు !

సంకర దేశం కావడం వల్ల కాబోలు అమెరికాకు, అన్ని డ్రిన్కున్నూ కలగలిపి తయారుచేసే కాక్‌టెయిల్ !

ఇలాగే ఒక్కొక్క దేశానికి వొక్కొక్క హాబీ వున్నదనికూడా చెప్పవచ్చునేమో !

బ్రిటన్, కుక్కల్ని పెంచడం !

అమెరికా, ప్రసిద్ధ పురుషుల సంతకాల కోసం పరుగులెత్తడం !

జపాను, గాలిపటాలను ఎగర వెయ్యడం!

స్పెయిన్, వృషభాలను పోట్లాడించడం ! స్విట్జర్లాండు, కొండల్ని ఎక్కడం ! పోతే, మన దేశానికి హాబీ ఏమిటి ?

కోర్టుల్ని ఎక్కడమా ?

పాశ్చాత్యులలో ప్రముఖుల్ని చూస్తే, ప్రతి వొక్కడికీ ఏదో వొక హాబివున్నట్టు కనబడుతుంది.

ఉదాహరణాలు కావాలంటే—

బాల్డ్విన్‌కు హాబీ, పందుల్ని పెంచడం !

లాయడ్ జార్జికి హాబీ, బంగాళా దుంపల్ని పండించడం!

సర్ సామ్యూల్ హోరాన్‌కు హాబీ, స్కేటింగ్!

నెవిలీచాంబర్లేన్‌కు హాబీ, చేపల్ని పట్టడం!

అమెరికా ప్రెసిడెన్ట్ రూజ్‌వెల్టుకు హాబీ, రకరకాల తపాలా బిళ్లల్ని పోగుజెయ్యడం!

పూర్వపు జర్మనీ చక్రవర్తి కెయిజర్‌కు హాబీ, కట్టెలు వెయ్యడం!

విన్‌స్టన్ చర్చిల్‌కు హాబీస్, తాపీపనీ, బొమ్మల్ని గియ్యడమూ!

ఇలాగే ప్రతివాడికీ ఏదో ఒక హాబీ తప్పకుండా వుండి తీరుతుంది.

ఇలా ఏదోఒక హాబీఅంటూ వుండడం చాలా మంచిదే కూడా!

స్వంత వ్యవహారలతోనూ, రాచకార్యాలతోనూ తలదిమ్మెక్కినప్పుడు, ఆ గొడవను అంతనూ కొంత కాలంపాటు పూర్తిగా మరిచిపోవడానికి ఏదైనా వొక వ్యాసంగం వుండడం ఎంతో హాయి!

అది లేకపోతే, బుద్ధి తీక్షత శీఘ్రంగా నశిస్తుంది; ఆరోగ్యం చెడుతుంది; జీవితాన్ని అనుభవించే శక్తి నష్టం అవుతుంది!

మన దేశాన్ని చూస్తే, తిలక్, గోఖ్లే, దాసు, లజపతిరాయి, సేన్‌గుప్తా, ఇంకా చాలా మంది ప్రముఖులు నడివయస్సులోనే పోయినట్టు కనబడుతుంది.

ఇందుకు కారణం ఏమంటారు?

నన్నడిగితే, "వీరి కెవరికీ కూడా హాబీస్ లేకపోవడమే!" అని జవాబివ్వడానికి సంకోచించను!

చికాకుగా వున్నప్పుడు మనస్సును వుల్లాసపెట్టడానికే కాకుండా, తదితర విధాలకూడా హాబిస్‌వల్ల వుపయోగం వుంది.

ఈ విషయాన్ని నచ్చచెప్పాలంటే, బాల్డ్విన్‌ను వుదాహరిస్తే సరిపోతుంది.

బాల్డ్విన్‌కు పందుల్ని పెంచడం సరదా అని కదూ చెప్పాను.

పందుల్ని పెంచడం హాబీగా పెట్టుకోవడం వల్లనే, అయనకు "ఆనెస్ట్ బాల్డ్విన్" అనే ఖ్యాతి వచ్చింది.

"ఆనెస్ట్" అంటే ఋజువర్తనం అని అర్థం. దానిమీద వచ్చిన విశేషణం "ఆనెస్ట్"

"అయితే, పందుల్ని పెంచడానికీ, ఋజువర్తనానికీ సంబంధం ఏమిటయ్యా?" అని మీరు అడగ వచ్చును.

అందుకు జవాబు!

బ్రిటిష్‌వారికి మేధావంతుల్ని చూస్తే, ఎంచేతనో గాని అపనమ్మకం!

ఇక, సంసార పక్షంగా వుండేవారంటే మాత్రం చెప్పనలవి గానంత విశ్వాసం!

అతి తెలివిగలవాడు కిలాడీ అవుతాడనీ, సంసార పక్షంగా వుండేవాడు ముక్కుకు సూటిగా వెడతాడనీ వారినమ్మకం కావచ్చును.

బ్రిటిష్‌వారి తత్వంలో జీర్ణించివున్న ఈ నమ్మకం కొద్దీ, అతి సంసార పక్షంగా పందుల్ని

పెంచే బాల్డ్విన్‌కు 'ఆనెస్ట్' అనే ఖ్యాతి సంక్రమించింది!

బాల్డ్విన్ రేపటినుంచి పందుల్ని దూరంగా తోలి, సింహాల్ని పెంచడం ప్రారంభిస్తే, బ్రిటిష్ పార్లమెంటు ఆయనమీద నిస్సందేహంగా విశ్వాసరాహిత్య తీర్మానాన్ని పెడుతుంది!

బాల్డ్విన్ కథను వినే కాబోలు, ముసోలినీ తన ప్రజల ప్రవృత్తికి అనుగుణ్యంగా తన హాబీస్‌ను 'సెలెక్టు' చేసుకున్నాడు!

ఇటాలియన్ ప్రజలు మంచి భావనాశక్తి వున్నవాళ్లు! వాళ్లకు లలితకళలంటే ప్రీతి! వీరోచితకృత్యాలంటే అభిమానం!

దీన్ని కనిపెట్టి ముసోలినీ సంగీతాన్ని, స్వారినీ, సింహాలతో చెరలాటాన్నీ, కత్తితిప్ప డాన్నీ, ఇలాగే ఇంకా మరికొన్ని గొడవపనుల్నీ తన హాబీస్‌గా పెట్టుకున్నాడు.

రాచకార్యాలలో నుంచి కొంచెం తీరిక దొరికితే చాలు, ఇటాలియన్ డిక్టేటర్ ఫిడేల్ పుచ్చుకుని గంటల కొద్దీ అలా వాయిస్తూ కూర్చుంటాడు!

ఇదీ కాకపోతే తన గుర్రాన్ని ఎక్కి, గట్లపై నుంచీ, పుట్లపైనుంచీ అతి దుడుకుగా స్వారీ చేస్తాడు.

స్వారీమీద ఆపూట మనస్సు పోకపోతే, తన మోటార్ సైకిల్‌ను గంటకు ఏనూరు మైళ్ల వేగం తోనో డ్రయివ్ చేస్తాడు!

ఇదీ కాకపోతే, ఏ ఆయుధమూ లేకుండా సింహాలబోనులోకి వెళ్లి, వాటి జూలునుపీకి, తోకనులాగి నానా పిచ్చిపనులు చేస్తాడు!

తాను ఇలా చేయడంవల్ల తన ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చునని అతగాడి వుద్దేశం!

ఈ వుద్దేశం ఇంతవరకు చాలా చక్కగా నెరవేరుతున్నది కూడా!

ముసోలినీ ప్రతి స్పర్ధిగా ప్రస్తుతం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న నీగస్ చక్రవర్తికి కూడా సింహాలంటే కొంత సరదా వుంది!

అయితే, ఆయన సరదాలో ముసోలినీ పిచ్చి వేషాలకు తావులేదు.

సింహాలు ఠీవికీ, గాంభీర్యానికీ, రాచరికానికీ చిహ్నాలని నీగస్ చక్రవర్తి నమ్మకం!

అంచేత, ఆయన తనకోటలో మచ్చిక పడిన సింహాలను వదిలివేస్తూ వుండేవాడు!

నాలుగైదు సంవత్సరాల క్రితం ఒకసారి ఆడిస్ అబాబాలోని బ్రిటిష్ రాయబారి చక్రవర్తి దర్శనంకోసం కోటకు రావడం, అక్కడొక సింహం ఎదురుపడడం, దాన్నిచూచి అతగాడు బెదిరిపోయి, పిస్టల్ వుపయోగించడం దాన్నివిని చక్రవర్తి కినుక వహించడం, ఈ గొడవ అంతా జరిగిందని ప్రతీతి!

మొన్నను తన దేశాన్నీ, ప్రజల్నీ వదిలి, పాలిస్టైన్ ప్రస్థానం కావలసిన వచ్చినప్పుడు నీగస్ చక్రవర్తి! "ముసోలినీకి సింహాలంటే సరదాలని చెబుతారు. నా సింహాలు అతగాడి స్వాధీనం కావడంనేను భరించలేను" అని చెబుతూ!– ఎంతో ఆప్యాయంగా తాను పెంచుకుంటూవచ్చిన అన్ని సింహాలనూ చంపించి వేయించాడట!

ముసోలినీ వలెనే డిక్టేటర్లు అయిన హిట్లరు స్టాలిన్, కెమల్‌పాషాలకు సయితం హాబీస్ వున్నాయి !

అయితే, ఈ ముగ్గురి హాబీస్‌కూడా సంసార పక్షమైనవే గాని, తలతిక్కగా వుండేవి మాత్రం కావు !

హిట్లరుకు వాగ్నెరు పాటలంటే సరదా !

స్టాలిన్‌కు పిల్లలతో ఆడుకోవడం అంటేనూ నాటకాలకు వెళ్లడం అంటేనూ సరదా !

పోతే, కెమల్‌పాషాకు డ్యాన్సు అంటే సరదా !

ఇంతవరకు అందర్నీ ప్రస్తుతంలో జీవించి వున్నవారిని మాత్రమే పేర్కొనడం వల్ల, హాబీస్ అంటే ప్రేమ ఇటీవలనే కలిగిందనీ, పూర్వం ఇది లేదనీ అనుకోడం పొరపాటు సుమండీ !

కావాలంటే, కీర్తిశేషులైన వారిలో కూడా హాబీస్ సరదావున్న వారిని ఎందరినో వుదాహరించ వచ్చును.

గ్లాడ్‌స్టన్‌కు.... కెయిజరువలెనే ....కట్టెలు కొట్టడం హాబీగా వుండేది.

వైకౌంట్ గ్రే పిట్టల్ని పెంచడం అంటేసరదా పడేవాడు.

పామర్‌స్టన్ వినోదంకోసం తోటల్ని పెంచేవాడు.

జార్జి చక్రవర్తికి రకరకాల పోష్టుబిళ్లల్ని స్వీకరించడం ఒక హాబీ !

లెనిన్‌కు చదరంగం ఆటలోనూ, వేటలోనూ సరదా వుండేది. టాల్‌స్టాయికి చీట్లాట అంటే మోజు - వృద్ధాప్యంలో కూడా పోలేదు.

షెకవ్ హాబీస్, తోటల్నీ, కుక్కల్నీ, పెంచడమూ, చేపల్ని పట్టడమూనూ !

ప్రిన్సు క్రొపాట్‌కిన్‌కు టీ కాయడంలోనూ దాన్ని నలుగురికీ ఇవ్వడంలోనూ, సరదా !

వ్రాసుకు పోతూవుంటే, ఈ పట్టీ ఇలా ఎంతైనా పెరిగి పోతుంది ! !

ఫలానావారికి ఆ హాబీ, ఫలానావారికి ఈ హాబీ వుండేదని చెప్పడంకంటె, వారివారి హాబీస్‌కు సంబంధించిన కథల్ని చెప్పడం ఎక్కువ బాగుంటుందేమో !

అంచేత, అలాంటి కథల్ని...కొన్నింటిని... చెబుతాను.

లెనిన్‌కు ఒకఅన్న వుండేవాడు. ఈయన్ను జారు చక్రవర్తిని చంపడానికి కుట్ర చేశాడనే నేరం క్రింద వురితీశారు.

ఈయన ఇంకా వురిపడక ముందు...అంటే అన్నదమ్ములు ఇద్దరూ కూడా ఇంకా పసికాయలుగా వున్నప్పుడు...వారి తండ్రి, కొడుకులిద్దరితోనూ చదరంగం ఆడుతూ వుండేవాడు.

తండ్రి ఒకపక్షం కొడుకులిద్దరూ ఎదిరిపక్షం!

ఆటలో ఎప్పుడూ తండ్రే గెలుస్తూవుండేవాడు !

ఇలా వుండగా ఒకనాడు అన్నదమ్ములిద్దరిలోనూ పెద్దవాడు...చదరంగాన్ని గురించి ఒక పుస్తకాన్నికొని, చదివాడు.

ఆ తర్వాత ఆటలో తండ్రే వోడిపోయాడు.

కొడుకుల చేతిలో వోడిపోయే సరికి ముసలివాడికి కంపరం పుట్టిందట! ఒకటి రెండు రోజులపాటు నిద్రాహారాలైనా లేకుండా చిక్కావు పడ్డాడట !

తాను ఓడిపోవడానికి కారణం ఏమైవుంటుందా అని ఆలోచించి, చివరకు పుస్తకం సంగతి తెలుసుకుని, ఎలాగైతే నేమి దాన్ని కాజేసి, ఒక్క రాత్రిలో దాన్ని అంతా చదివేసి మర్నాడు వుదయం కొడుకుల్ని మళ్లీ ఆటకు పిలిచి, వారిని గెలిచి, తన ప్రతిష్ఠనుపునః ప్రతిష్ఠించుకున్నాడు.

తనతండ్రి తలపుకు వచ్చినప్పుడు లెనిన్ ఈ కథనుచెప్పి నవ్వుతూ వుండేవాడు!

రాచకీయాల్లో బాగా ప్రవేశించిన తర్వాత తన కాలాన్ని ఎక్కువగా వృథాపరుస్తున్నదన్న కారణంచేత లెనిన్ చదరంగాన్ని ఆడడం మానివేశాడు గాని, వేటఅంటే మాత్రం ఆయనకు చివరివరకూ సరదాపోలేదు!

ఒకనాడు కొందరు మిత్రులతో కలిసి లెనిన్ తోడేళ్ల వేటకు వెళ్లాడు!

అప్పుడొక పట్టులో తోడేలొకటి సరిగ్గా ఆయన యెదటికి వచ్చింది.

దాన్ని కాల్చడానికి ఆయన తుపాకి యెత్తాడు; గురిచూచాడు. కాని ఎంచేతనో 'ట్రిగ్గర్' నొక్కలేదు!

క్షణలేశం ఇలా ఆలస్యం జరిగేసరికి తోడేలు చెంగున గెంతి, పారిపోయింది!

తర్వాత మిత్రులు వచ్చి "అందిన తోడేలును పోనిచ్చావేం?" మని అడిగితే!

"బెదిరిపోయిన దానికళ్లను చూస్తే, కాల్చడానికి చేతులు రాలేదు?" అని లెనిన్ చిరునవ్వుతో జవాబిచ్చాడు!

చెకొవ్, ప్రసిద్ధికెక్కిన రష్యన్ కథకుడు.

ఈయనకు ఎవరో ఒక పెద్దమనిషి వొకనాడు చాలా ఖరీదు పెట్టి కొనితెచ్చిన వొక పురాతన శిలా విగ్రహాన్ని బహూకృతిగా ఇచ్చాడు.

దాన్ని అందుకున్న తర్వాత మిత్రులలో ముచ్చటిస్తూ, చెకవ్

"నేను పురాతన శాస్త్ర పరిశోధకుడిని అనుకుని, ఆ పెద్దమనిషి నాకు ఈ విగ్రహాన్ని అంటగట్టి వుండాలి! అంతకన్నా ఒకగాలం కొని యిస్తే, నేను ఎక్కువ సంతోషించే వాడిని కదూ?" అన్నాడు!

చేపలు పట్టడమంటే చెకొవ్ కు అంత సరదా వుండేది!

చేపల్ని పట్టడమే కాకుండా...ఇంతకు పూర్వము చెప్పినట్టు...తోటల్ని వెయ్యడమూ, కుక్కల్ని పెంచడమూ కూడా ఆయనహాబీన్!

చుట్టల్ని కాల్చడం హాబీ అనడానికి వీలు లేదు గాని, కార్లయిల్ను గురించి చెకొవ్ కథకు దగ్గరగావున్న కథవొకటి వుంది.

కార్లయిల్ ... నిద్రపోయే ఏ కాస్సేపటినో మినహాయిస్తే...మిగతా అన్ని వేళలా చుట్టను కాలుస్తూనే వుండేవాడు!

ఇది ఆయనకు ఎంత పెద్దవ్యసనం అంటే

"ఫ్రెడిరిక్ ది గ్రేట్" జీవిత చరిత్రను రాసినందుకు, ఆ జర్మన్ చక్రవర్తి ఎంతో సంతోషించి పెద్ద గౌరవచిహ్నంగా ఏదో మెడల్నును పంపితే కార్లయిల్

"ఇంతకన్నా రెండుపౌనులు మంచి పుగాకును పంపితే, ఎంత సంతోషించే వాడిని!" అన్నాడు!

సర్ సామ్యూల్ హోర్‌కు 'స్కేటింగ్' హాబీ అని చెప్పానుకదూ!

'స్కేటింగ్' అంటే, బూట్సు క్రింద చక్రాలను కట్టుకుని, మంచు పేరుకున్న నేలమీద జర్రున జారడమూ, గిర్రున తిరగడమూ, గంతులు వెయ్యడమూ!

ఈ విద్యలో హోర్ చాలా గట్టివాడు!

ఏడెనిమిది మాసాలనాడు ఇటలీ - అబిసీనియాల యుద్ధాన్ని ఎలాగైనా ఆపు చెయ్యాలనే వుద్దేశంతో అప్పటిలో విదేశాంగ మంత్రిగా వుంటున్న హోర్, ఆనాటి ఫ్రెంచి ప్రధానామాత్యుడైన లావలుతో సంప్రదించడానికి ప్యారిస్ వెళ్లాడు.

ఒక వైపున లావలుతో సంప్రదింపులు జరుగుతూ వుండగానే, హోరుకు. స్కేటిన్గ్ మీదికి బుద్ధిపోయింది!

బుద్ధిపోవడమే తడవుగా 'స్కేట్సు' కట్టుకుని, తయారయ్యాడు!

స్కేటిన్గులో పెద్ద మొనగాడని ప్రసిద్ధి గడించినా, ఆనాడు అదేమో గాని నాలుగు చక్కర్లు కొట్టాడోలేదో, ముందుకు పడి, ముక్కు చితకగొట్టుకున్నాడు.

ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో లావలుతో సంప్రదింపులను ముగించి, ఒక రహస్యపు వొడంబడికను సిద్ధంచేశాడు.

ఈ వొడంబడికను గురించి ఇదమిత్థమని బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు నిర్ణయించకమునుపే, దాని షరతులు ఎలాగో వెల్లడి అయినాయి!

వెంటనే, ఆ షరతులు అన్యాయంగా వున్నాయని, పెద్ద గగ్గోలు బయలు దేరింది.

అప్పుడిక గత్యంతరం లేక, హోర్ తన విదేశాంగ మంత్రి పదవికి రాజీనామాను పెట్టవలసి వచ్చింది!

అయితే!

హోర్ స్కేటిన్గ్ చెయ్యబోయి ముక్కు చితక గొట్టుకోడానికీ, వొడంబడిక చేయబోయి బుర్రబొప్పి కట్టించుకోడానికీ సంబంధంఏమిటో జ్యోతిషశాస్త్ర పారంగతులైన శ్రీ శిరోమణి గారు చెప్పగలరేమో!

హాబీస్ కొందరికి సరదా అయితే, మరి కొందరు ఈ సరదాను డబ్బుచేసుకుంటూ వుంటారు.

ప్రసిద్ధ గ్రంథాల ప్రథమ, ద్వితీయ ముద్రణ ప్రతుల్నీ, రకరకాల తపాలా బిళ్లల్నీ, సుప్రసిద్ధులైనవారి సంతకాలనూ సేకరించి, అమ్మడమే వ్యాపారంగా పెట్టుకున్న వారు ఎందరో వున్నారు?

ఈ పైమూడు రకాల హాబీస్‌కు సంబంధించిన వస్తువులకు...అవి అంటే వున్న మోజును బట్టి...ధర పెరుగుతూ వుంటుంది!

షేక్సుపియర్ నాటకాల ప్రథమ ముద్రణ ప్రతులు అసలులేవు! పోతే, ద్వితీయ ముద్రణ ప్రతులైనా చాలా అరుదుగా వున్నాయి.

ఈ ద్వితీయ ముద్రణప్రతి వున్నవాడు మహా అదృష్టవంతుడనే చెప్పాలి! ఎంచేతనంటే దాన్ని తెగనమ్మినా, అతగాడికి ఏ తొమ్మిది, పదిలక్షల రూపాయలకు తక్కువ గిట్టదు!

ప్రసిద్ధగ్రంథాల ప్రథమ, ద్వితీయ ముద్రణ ప్రతులకంటే కూడా, వాటి గ్రంథకర్తల వ్రాత ప్రతులు (Manuscrifts) వుంటే, ఇంకెంత గానో డబ్బు చేసుకోవచ్చును.

ఒకప్పు డొక ఆక్సుఫర్డు యూనివర్సిటీ ప్రొఫెసర్ వేసంగి సెలవుదినాల్లో తన మిత్రుడి ఇంటికి అతిథిగా వెళ్లడం తటస్థించింది.

అప్పుడా స్నేహితుని కుమార్తె ఏమైనా కథలు చెప్పమని వేధించింది.

అవడానికి ఆయన గణిత శాస్త్రంలో ప్రొఫెసర్ అయినా ఒక పసిపాప కథలు చెప్పమని గొడవ చెయ్యడం చూడగానే సరదాపుట్టి, "ఎలైస్ ఇన్‌వన్‌డర్ లాన్‌డ్" (Alice in Wonder land) అంటూ ఒక పుస్తకాన్నే వ్రాసి, ఆ అమ్మాయిని బహూకరించాడు.

తర్వాత ఆ పుస్తకం ప్రకటన అయ్యింది; ప్రకటన కాగానే చిన్నపిల్లల కథల పుస్తకాలలో దాన్ని మించింది లేదని ప్రసిద్ధి కూడా పొందింది.

తాను బహూకృతి పొందిన పుస్తకం సుప్రసిద్ధం కావడం చూచి, ఆ అమ్మాయి తన వ్రాతప్రతిని ప్రాణప్రదంగా దాచుకుంది.

కాని, బాగా ముసలితనం వచ్చిన తర్వాత, దారిద్ర్యం వస్తే గత్యంతరం లేక దాన్నిఅమ్మజూపింది.

అప్పుడు ఆ వ్రాతప్రతికి ఎంత ధర వచ్చిందో చెప్పమంటారా?

షుమారు లక్షన్నర రూపాయలు!

చేవ్రాలు ఇంగ్లీషులో అయితే "ఆటోగ్రాఫ్" అంటారు.

ఆటోగ్రాఫ్పును సేకరించడం అనే సరదా - ఇదివరకే మనవిచేసినట్టు - అమెరికాలో విపరీతంగా వుంది.

అక్కడిది కేవలంగా హాబీగా వుండడం మాని, వెర్రిగా పరిణమించింది కూడానేమో!

ఆటోగ్రాఫ్పు కోసం ఎగబడేవారి బాధ నుంచి తప్పించుకోవడం ఎలాగా? అనేది ఆ దేశంలో ప్రతిప్రసిద్ధ వ్యక్తికీ ఒక పెద్దసమస్య అవుతూవుంది.

ఒకసారి గ్రేటాగార్బో ఆటోగ్రాఫ్ పిచ్చి వాళ్ల బారినుంచి పారిపోవడాని కంటూ ప్రహరి గోడ దూకబోయి కాలు విరగగొట్టుకున్నదని ఎక్కడో చదివిన జ్ఞాపకం!

అమెరికాలో ప్రసిద్ధ పురుషుల ఆటోగ్రాఫ్పును సేకరించడానికీ, వాటిని కావలసిన వారికి అమ్మడానికీ...వర్తక సరళిమీద...ఏజన్సీలు వున్నాయి కూడా!

ఈ ఏజన్సీలవారు ఆయావ్యక్తి ప్రసిద్ధిని బట్టి ఆటోగ్రాఫ్పునే చార్జి చేస్తూవుంటారు.

చార్లీచాప్లీన్, గ్రేటాగార్బో - ఈ యిద్దరు సినిమాస్టార్ల ఆటోగ్రాఫ్పు కావాలంటే, ఒక్కొక్క దానికి కనీసం ఏ యాభైరూపాయలో చెల్లించుకో వలసి వస్తుంది!

ఎంతైనా కోమటి గనక, గాంధీజీకూడా ఈ ఆటోగ్రాఫ్పు వ్యాపారం చేస్తున్నాడు!

ఆయన ఆటోగ్రాఫ్ కావాలంటే, ఆ జన్మాంతరం ఖద్దరు కావాలని దీక్షఅయినా కానుకగా సమర్పించుకోవాలి.

తెలివిగలవా డెవడైనా వుండి గాంధిజీకి అయిదువందల రూపాయలిచ్చి, నూరు ఆటో

గ్రాఫ్సును పుచ్చుకుని, వాటిని మ్యూరు జేరానికి అమెరికా పంపిస్తే, ఏ అయిదు వేలో గిట్టుపాటు అవుతాయి!

ఇప్పటికే ఈ వ్యాసం చాలా పెరిగినట్టు వున్నది గనక, ఆటోగ్రాఫును గురించి రెండు ఛల్ని మాత్రం చెప్పి, ఇక్కడితో దీన్ని ముగిస్తాను.

మొదటికథ:—

షెకవ్ వ్రాతలో ఎంత మొనగాడో, వైద్యంలో అంత గట్టివాడు కూడా!

ఆయన వృద్ధాప్యంలో ఒక వ్యక్తి వైద్య సంబంధంలో సలహాకంటూ వచ్చాడు.

"నేను ప్రాక్టీసు మానివేసి చాలాకాల మైంది. మరెవరి దగ్గరికైనా వెళ్లగూడదా?" అని ఎంతచెప్పినా ఆ వ్యక్తి ససేమిరా వినలేదు.

గత్యంతరం కనబడక ఆయన తీరా షెకవ్ కావలసిన సలహా ఇచ్చిన మీాదట, అతడు ఫీజు ఇవ్వబోయాడు.

"ఫీజు, గీజు, వద్దు దేవుడా" అని చెప్పినా, వినలేదు.

"వద్దని చెప్పినా, అంటగట్టి వెడుతున్నావు గనక దీన్ని ఏ పబ్లికు సంస్థకైనా ఇచ్చివేస్తాను" అని షెకవ్ అంటే!

"మీారు ఏమిచేసినా, సరేగాని, నాకు రసీదు మాత్రం ఇప్పించండి" అన్నాడు.

"వీడెవడో విచిత్రమైన వ్యక్తిలా వున్నాడే!" అని ఆశ్చర్యపడుతూ, షెకవ్ రసీదును వ్రాసి ఇచ్చాడు.

రసీదును భద్రంగా దాచుకుంటూ, ఆవ్యక్తి "అమ్మయ్యో! ఎలానైతే నేం నాయెత్తు పారింది. నాకు మీా ఆట్రోగ్రాఫ్ దొరికింది!" అని సగర్వంగా నవ్వాడు!

రెండోకథ:—

ఎడ్వర్డు చక్రవర్తి చిన్నప్పు డొకసారి తల్లి ఇచ్చిన ఎలవెన్సును కాస్తా ఖర్చుపెట్టి వెయ్యడమే కాకుండా, అయిదు పౌనులవరకు అప్పు కూడా చేశాడు.

ఆ అప్పు ఇచ్చినవాళ్లు పీకుతూవుంటే, తల్లికి "వచ్చేనెల ఎలవెన్సులో నుంచి అయిదు పౌనులు ఎడ్వాన్సు ఇవ్వ"మని కోరుతూ వుత్తరం వ్రాశాడు.

కొడుకు ఖర్చుదారుడై చెడిపోతున్నాడని విక్టోరియారాణి, పొదుపరితనంగా వుండవలసిన ఆవశ్యకాన్ని బోధిస్తూ రెండు మూడు పేజీల వుత్తరము వ్రాసింది.

ఆ వుత్తరాన్ని పట్టుకువెళ్లి ఎడ్వర్డు రాజు కుమారుడు ఆటోగ్రాఫ్సు వగైరాలను కొనుక్కునే వాళ్ళకు పదిహేను పౌనులకు అమ్ముకున్నాడు!

దానితో ఆయన అప్పుకాస్తా తీరిపోగా, పది పౌనులు మిగిలింది! తెలివి అంటే అలావుండాలి!

ఈ వుత్తరం చాలా చేతులు మారి, ప్రస్తుతం అలహాబాదు కోటీశ్వరుడు సాసూన్‌గారి దగ్గరకు చేరిందని ప్రతీతి!

---